# ముసలమ్మ మరణం

ముసలమ్మ రావటం యిది తొలి సారికాదు. ఇలాంటి సమయంలో వచ్చి అక్కడున్న ప్రమోదమైన వాతావరణంపై దాడిచేసింది. ఇంటికి అంతదూరంలో ఉండగానే పెద్ద గొంతుకతో రాగాలుతీస్తూ యేడుస్తోంది. చప్పున యింటి యజమాని బయటకు వెళ్ళి "వెళ్ళిపో - రేపు రా." అని కేకవేశాడు అతని కాళ్ళమీదపడి "నా బాబూ! నువ్వు దేవతల్లో దేవేంద్రుడివి - శిబిచక్రవర్తివి - నీ పేరు వూరూరా చెప్పుకుంటున్నారు. ఢిల్లీ దాకా మోగుతున్నది.!!

"చాలు చాలు... రేపు రా."

"అంత పెంచినాను. అది అన్యాయం చేసింది. నా కేదిక్కూ లేరు. నీ యింట్లోనే వుండిపోతాను."

ఇంతలో యింటావిడ వచ్చి ఒక్క గసురు గసరగానే మామూలుగా ఆమెపాట విన్నట్లే మళ్ళీ "మాతల్లి లక్ష్మీదేవి - పార్వతి - శచీదేవి - కలకాలం పసుపుకుంకంతో..."

"వెళ్ళిపోమంటూంటే..."

ముసలమ్మ యీ రాత్రికి కదిలేటట్లు లేదు. ఇంతలో యింటికి వచ్చిన అతిథులు గుమిగూడారు.

"ఈ ముసలమ్మ - మీ చుట్టమటగా!" అని ఒకావిడ యెత్తింది.

"ఈ అడుక్కునేది మా చుట్టమెలా ఔతుంది?" యింటావిడ.

"మీ చుట్టమని చెప్పి మా దగ్గిర పాతచీర తీసుకువెళ్ళింది."

"మా తల్లి - ఆ అందమైన చీర కట్టుకునే మనవరాలు రంగు చేసింది - ఎగిరిపోయింది." ముసలమ్మ నెత్తి బాదుకుంది.

ఇంటావిడ కోపం పట్టలేక, "వెళ్ళకపోతే చూడు-పనివాడిచేత గెంటిస్తాను"

"అలా గంటావుగాని బిడ్డల గన్న తల్లివి. నువ్వు కోపంగా అంటున్నా కనికారపు ముద్దువు. బంగారు బొమ్మవు. అందుకే యెంచెంచి నీ ఇంట బతకడానికి వచ్చాను."

"ఇలాంటి వాళ్ళని చేరనివ్వద్దని ఆనాడే చెప్పానా? పదుగురి పెద్దల్లో చూడండి - మనకు నగుబాట్లు - ధర్మానికెళ్తే నెత్తిమీద కూర్చుంటోంది. వదిలించుకోలేని జిగురై కూర్చుంది. పదండి;" ఇంటావిడ లోనికి చిరాకుగా వెళ్ళిపోయింది.

ఏలాగా కదలదని నిర్ధారించుకున్న యింటి యజమాని మధుమూర్తి ముసలమ్మను బ్రతిమాలాడు. పెద్ద

బలివాడ కాంతారావు

అంతా వెళ్ళివి ——— పెరటి వరండాలో కూర్చొని చెప్పాడు. ఆ చీపికళ్ళతో అంగీకారాన్ని సూచిస్తూ నడ్డి వంచుకుని మెల్లగా కదిలింది.

నలుగురు అమ్మాయిల తర్వాత పెళ్ళయిన తొలిరోజులనించీ ఆశించిన రత్నంలాంటి కొడుకు పుట్టాడు. ఈ కొడుకు పుట్టాడనే వేడుక. పదుగురు మిత్రులనూ వారి అర్ధాంగులతో యీ యింటికి రప్పించింది. పానకంలో పుడకలా ముసలమ్మ గోల యీ ఆనందానికి అంతరాయం కలిగించింది. చాలా సేపు ఆడా మొగా కలిసి పిల్లవాని రూపురేఖలు చర్చించుకున్నారు. తల్లి రూపని ఆడవాళ్ళంటే, తండ్రి రూపని కొందరు మగవాళ్ళు, వాళ్ళలో వాళ్లు తర్జన భర్జనలు పడ్డారు. ముక్కూ కళ్ళూ తల్లివనీ, చేతులూ, తలా తండ్రివనీ చివరకు అంతా యేకీభవించారు ఈ కూడలిలో ఆ డిపార్టుమెంటులో యే ఆఫీసరుకు యెంతమంది పిల్లలో, అందులో ఆడపిల్లల జనాభా హెచ్చున్న వాళ్ళ ఆవేదనలూ, ఆశలూ వగైరా చర్చించుకున్నారు. పిల్లల పెంపకం గురించీ, చీరలగురించీ చర్చ అయ్యాక, ఆఫీసు బెడదల గురించి, ఆడవాళ్ళే మగవాళ్ళకంటే హెచ్చు సమాచారం, అందులో గుట్టుగా వుంచవలసిన సమాచారంకూడా బయటపెట్టారు.

నవ్వించాలని కొందరు తమాషాగా మాటాడారు. కొంతరేమో మొగమాటానికి ఆ మాటలకి నవ్వారు. తాగకపోతే మర్యాద కాదని కొందరు మగాళ్ళు తాగారు. తాగాలనివున్నా మర్యాద కాదని కొందరు ఆడవాళ్ళు తాగలేదు. తరవాత ఆడవాళ్ళంతా లేచారు. ప్లేట్లలో తమకు కావలసినవి రెండు టేబిళ్ళ మీద ఇంపుగా అమర్చబడిన భోజన పానీయాలనించి తీసుకున్నారు. తరవాత మగాళ్ళు లేచారు. తింటూ రుచులు చెప్పుకుంటున్నారు. కోడిమాంసం వండే విధా లెన్నో చర్చించుకుంటున్నారు అందులో కొందరు పాశ్చాత్య దేశాలు తిరిగివచ్చినవా రున్నారు. వాళ్ళ ఆచార వ్యవహారాలకంటె అక్కడ తిన్న తిండీ, చూసిన అందం చర్చించుకుంటున్నారు. ఆడవానికి లొంగి, తిరిగే ఆ దేశపు మగాళ్ళ మనస్తత్వాలపై యెన్నెన్నో దృష్టాంతాలు చెప్పుకొచ్చారు. ఇంటావిడ బలవంతం చేసి మరీ తినలేనివాళ్లు తినేట్లు చేస్తోంది. మొగమాటానికి వేసుకుని సగమే తిన్నవా ళ్ళున్నారు. డిన్నరు అయ్యాక తియ్యని పాయసం తాగటం పూర్తి అయింది. ఆడవాళ్లు పాటలు పాడటానికి మురిపించగానే ఒక గార్దభస్వరుడైన మగాడు ప్రేమ గీతి తొలి చరణం యెత్తాడు. భర్త ప్రోత్సాహంతో ఒక బెంగాలీ గృహిణి



రవీంద్రుని గీతం ఆలాపించింది. అర్థం తెలియని వాళ్ళుకూడా ఆ సంగీతానికి నాగస్వరం విన్న నాగుల్లా తలలు ఊపారు. సంగీతం తెలిసిన దక్షిణాది మగాడు త్యాగరాజకృతి, "ఎందరో మహానుభావులు" అరవంచేసి పాడాడు.

అంతా పూర్తయేసరికి రాత్రి పన్నెండు దగ్గరయింది. కాంపౌండు గేటువరకూ అతిధులను దిగబెట్టి తిరిగి వచ్చాక మూర్తికి ముసలమ్మ జ్ఞప్తికి వచ్చింది. పెరటి తలుపు తీసి వరండా దీపం వెలిగించాడు వెంటనే రెండు లోతుకుపోయిన కళ్లు అగుపించాయ్. తనను చూడగానే ఆ కళ్లు తిప్పి కుక్క వాకిట్లోకి కదిలిపోయింది. యెంగిలిపడ్డ ఆహారం డొక్కులో పడు

తు                    గాస్తోంది. వరండాలో ఒకమూల ముసలమ్మ నేలమీద నిద్రపోతోంది. తుప్పలాంటి జుత్తూ, తీక్షణమైన ముక్కూ, ముడతలు పడ్డ కడుపూ కనిపిస్తున్నాయ్. కండలు హరించుకుపోయిన కాళ్లూ, చేతులూ, ఎముకలు మీద వేలాడే తోలు ముఖం, రెప్పలు కప్పి మనసును శాంతింపజేసిన కళ్లూ - కళ్ళలో కాంతి వెలిగినన్నాళ్లూ మనిషికి మనసులో ఆవేదన వుత్పత్తి అవుతుంది. అన్ని ఆవేదనలకన్నా ఆకలి వలన వచ్చిన ఆవేదన అగ్నిలా శరీరమంతా దహించివేస్తుంది.

మనుషులంతా గాలి పీలుస్తారు. పీల్చలేనివాళ్ళందరికీ ఒకే రకమైన అంతం వస్తుంది. మనిషి అదృష్టవంతుడో, దురదృష్టవంతుడో నిజానికి అతని మరణానంతరమే తేలుతుంది. ఈ ముసలమ్మ మరణం గురించి మూర్తి జాలిగా ఆలోచించసాగాడు. కష్టాల తడియిటుకలతో, కన్నీటితో తడిపిన బురదతో కట్టిన యింటిలాంటి యీామె జీవితం చిన్న గాలివానకే కూలిపోయి కరిగిపోతుందనుకున్నాడు. తట్టి లేపాడు.

లేస్తూనే పొగడ్తమాటలు కొల్లలుగా కురిపిస్తోంది. ఎగరగా తనే తెచ్చి ఆకునిండా భోజనం పెట్టాడు. ఆ చిపికళ్ళు ఆనంద భాష్పాలతో వుబ్బిపోయాయ్. మాటాడకుండా గబగబా కడుపునింపుకున్నాక ఆయాసం అనిపించింది. ఎదరగా యింకా నిల్చున్న మూర్తి వేపు చూస్తూ.

"రోజూ యిలాగ తిండి పెట్టకు బాబూ! బలిసిపోయి మంచీ చెడూ తెలుసుకోలేను."

"ఈ వయస్సులో బలుస్తావా?''


"కడు పాకపక్క కాలుతుంటేనే మంచేదో, చెడుగేదో తెలుస్తుంది. నేను వస్తుండినా, మనవరాలి కడుపు నిండా పెట్టాను. అబద్ధా లాడాను. అడుక్కున్నానుగానీ నీతి తప్పలేదు. కొవ్వెక్కి నేను వద్దంటానని పైజాతాడితో లేచిపోయింది. పిచ్చి యేంజేస్తాను? దాని రాత అది. నా రాత యిది. ఎవరి రాత వారిది."

"సరా! ఇంక పొమ్మనండి," లోనించి భార్య గొంతుక.

"ఎక్కడికి పోతాను పార్వతమ్మా. కాశీ అన్నపూర్ణవి. అందుకే నీ యింట చేరాను.''

"పడుకో."

ఆ రాత్రి మొగుడూ పెళ్ళాలు తీవ్ర వాగ్యుద్ధం చేసుకున్నారు. అలాంటి అడుక్కునేదానిని, దొంగను, చావడానికి సిద్ధంగా వున్న ముసలిదానిని యింట్లో పెట్టుకోడానికి భార్య యెంతమాత్రం యిష్టపడలేదు. ఇంటి విషయాలపై హక్కును యే ఆడదీ వదలుకోదు. మూర్తి ఆ హక్కును




తీసుకోలేకపోయాడు. తెల్లారు ఝామున పంపించివేద్దామని లేచేసరికి వాకిట తుడుస్తున్న చప్పుడైంది. మూర్తిని చూడగానే–

"నాయనా– ఇది యెవరిల్లు? తుడిచి కళ్లాపు జల్లి ముగ్గేస్తే లక్ష్మీదేవి కలకళ్లాడుతూ యింట కాలుపెట్తాది" క్రోటన్సు చెట్లకొమ్మలు విరిచి చీపురు చేసిందని కోపం వచ్చినా బాల్చీతో నీరు తెచ్చాడు. ఇంట్లో గోధుమపిండి వుంటే యిచ్చాడు. అష్టవంకరలతో ముగ్గు వేశాక "చూడు, చీమలు పాకుతున్నాయ్. ఈ ధర్మమే మిగుల్తుంది నాయనా!"

ఎందుకు వచ్చాడో మరచిపోయిన మూర్తికి భార్యవిషయం జ్ఞప్తికి వచ్చింది. చెప్పలేక చెప్పలేక వెళ్ళిపొమ్మని చెప్పాడు. దానికి భాగ్య గొంతుక కూడా కలిసింది.

"ఇంట్లోకి రానులే తల్లీ– సత్తువ వున్నంతకాలం మీకింద యింత చాకిరీ చేస్తాను. రోజుకోపూట యింత గంజిపోస్తే చాలు."

మూర్తి భార్య వేపు మౌనంగా చూశాడు. ఆమె చిరాకుగా వెళ్ళిపోయింది. ఏటూ తేల్చలేక ఒకసారి వెళ్ళాడు.

"అది దొంగముండటండీ. మనచుట్టమని యిన్నాళ్ళూ తెలిసినవాళ్ళందరి దగ్గరా అడుక్కుంది. మన నౌకరిపిల్ల యింట్లోనికి వెళ్ళి తిన్నాదట. — నేడో ఛస్తే దానికార్యం

చేస్తారా? ఈ బండను మనంయెందుకు మీదేసుకోవటం?"

చేసేది లేక మూర్తి బయటకు వచ్చి "అప్పుడప్పుడు కనిపిస్తుండు మామ్మా."

"బాగుంది, నే నెక్కడికి వెళ్ళి పోతాను? మీరు వదలి విడిచిన మెతుకులు నమిలైనా మీ పంచనే వుంటాను."

"ఇప్పు డెక్కడున్నావో అక్కడే వుండు," అని మెల్లగా "ఏదో యిస్తూంటాలే"

"అమ్మా! నువ్వు కట్టి వదిలిన గుడ్డ పాత, యెంగిలిచేసి వదలిన కూడుతో యీ యెముకల గూడును నిలబెట్టమ్మా - పార్వతీదేవీ -"

ముసలమ్మ మొండికెత్తినట్లు వరండా కదల్లేదు. మూర్తి నాకు చేతకాదని ఆఫీసుకు వ్యెళిపోయాడు. ఇంటావిడ యెన్నో విధాలయీ పీడను వదళించుకోవాలని ప్రయత్నించింది. సత్యాగ్రహం చేస్తున్నట్లు ముసలమ్మ కదల్లేదు.

"వెళ్లిపోయిందా?" అన్నాడు మధ్యాహ్నం భోజనం చేస్తూ మూర్తి."

"ఆకునిండా నిన్నరాత్రి పెట్టారుగా! తినటం మరిగింది, యెందుకు కదులుతుంది?''

అయితే యేం చెయ్యదలచావ్?"

"ఆకలి వేస్తే మళ్ళీ యెక్కడికో అడుక్కోడానికి పోతుంది లెండి."

మూర్తి వచ్చాడని పోల్చుకున్న ముసలమ్మ మళ్ళీ పొగడ్తకు లంకించుకుంది. సగం తిని లేచినమూర్తి వేపు విస విస చూసి మిగిలింది ఆ భార్యే తిన్నదిగాని పెరటకు వెళ్ళలేదు. సాయంత్రం వచ్చేసరికి ముసలమ్మ లేదు.

"మొత్తానికి వదిలించుకున్నావన్న మాట!" మూర్తిమాటలకు సగర్వంగా జవాబు చెప్పబోతున్న భార్యకు మళ్ళీ వరండాలో యెవరో కదిలిన చప్పుడు వినిపించి కిటికీ గూండా చూసింది. ఎక్కడ దండు కొచ్చిందో - తినటానికి ముసలమ్మ కూర్చుంటూంటే, చప్పున తలుపు తీసి "ఈ ముష్టితిళ్లు తినడానికి మా వరండాయేనా దొరికింది? ఫో! ఫో."

"నీ యింట గెంజే అమృతంగా తాగేస్తానంటే పోశావు కాదు. మరేం చేస్తాను అన్నపూర్ణా?"

"దానాలు చెయ్యటానికి మాకు వూరకనే యేం రాలేదు. వెళ్ళువెళ్ళు."

"ఉన్నచేతులను మొండిచేతులు చేసుకోకు తల్లీ. పేదా రోదకు యిస్తుంటే, మీ చేతుల్లో బంగారంగాజులు గలగల్లాడుతూ కదులుతుంటాయ్.''

"ఈ ముసలి ముండకి కవిత్వం కూడా వచ్చుండీ.''

'ఎనోనోన్నోముల ఫలంతో యిలాగ పుట్టావ్. అలాంటి అన్నదాత మొగుడై కూర్చున్నాడు. లోకంలో మిగిలేది మూటకాదు – 'మాట'.''

"నాకు వేదాంతం బోధిస్తోందండీ."

"నాలాంటి ముసలి ముండకి కడుపే వేదాంతం అమ్మా!"

"సరే, వెళ్ళు, వెళ్ళు."

"నాలాంటి అడుక్కునే ముండ మీద పగెందుకు తల్లీ?'' పగ గలిగిన యింట్లో పాములు వుంటాయంటారు. పోని నాలాంటి – కాదు రమ్మంటున్న ముండకి యీ వరండామీద రాత్రుళ్లు పడుకునే చోటైనా యీ తల్లీ."

"ఏ రాత్రివేళో చలితో ఛస్తే నీ క్రింద యెవరు చేస్తారు?''

ముసలమ్మ తింటూనే నవ్వింది "చావు చెప్పి రాదమ్మా! ఎవరు ముందో యెవరు వెనకో చెప్పలేం. బతికినంతకాలం నిండుకుండలా తొణక్కుండా వుండటం నేర్చుకుంటే చావు బాధ నవ్వుతూ అనుభవిస్తాం."

"ఈ ముసలమ్మ మాటలు చూస్తుంటే...''

''బతికి చెడినదానిని. పోయిన బంగారాలూ, శృంగారాలమీద ఆశ లేదుగాని, బతుకుమీద మాత్రం ఆశ పోలేదు. ఏది తప్పినా చావు తప్పదు కదా! నీ పంచ చేరితే చావు బాధ నవ్వుతూ అనుభవిస్తాను. నువ్వు వద్దన్నా బాబు వద్దనలేదు"

"మమ్మల్నెందుకు శనిలా విడిచి పెట్టవు? నీ కింద చేయటానికి దగ్గిర దానవా? నాకు కోపం [illegible]క- యింద, యీ రూపాయి తీసుకుని, పో," అంటూ మీద పారేసి లోనికి వెళ్ళిపోయింది.

కాస్సేపయ్యాక గదిలో కాలు పెట్టిన మూర్తిని చూడగానే ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగిపోయాయ్. మౌనంగా దగ్గరగా చేరిన అతనిని చూడగానే ఒక్కసారి విజృంభించింది.

"అందరూ మిమ్మల్నే పొగడాలని మరింత నన్ను చులకన చెయ్యండి. ఇది సంసారి యిల్లా? సన్యాసి యిల్లా? అడుక్కునే ముండచేత అన్ని మాటలనిపించారు. ఆ దొంగముండని వాకిటే కాదు యింట్లోనే పెట్టుకోండి...ఊ వెళ్ళండి...వెళ్ళరా...?'' అంటూ, గబగబా, పెరటకు వెళ్ళి "రా మామ్మా! రా లోపలికి రా..." అంది.

ముసలమ్మ చప్పున లేచి, "లక్ష్మీదేవి–అన్నపూర్ణ. నీ లాంటి యిల్లాలు నూటికో కోటికో..." అంటూ, లోనికి వచ్చి, అందంగా అలంకరించబడిన గదులను చూస్తూ, "ఇలాంటి యింద్రభవనంలో దేవేంద్రుడిలా వున్నాడు బాబు! శచీదేవిలాంటి యిల్లాలు – పిల్లలు మాణిక్యాలు. ఆ


లోకేశ్వరుడు మరింత ఐశ్వర్యం, నా అంత ఆయుస్సు యిచ్చి మీ అందరినీ సుఖపెడ్తాడు,'' అంటూ ఇల్లు నలుమూలల్నీ వింతగా చూసింది.

ఆమె నలా విడిచిపెట్టి యింటి యిల్లాలు ఉమ తన గదిలోనికి వచ్చి తాళాలగుత్తి మొగుడి యెదర వేస్తూ, "ఈ వేళనుంచీ యేం పోయినా నా పూచీ యేంలేదు."

మూర్తి అక్కడినుంచి కదలిపోయాడు. క్లబ్‌లో ప్రాక్టీసులేని పేకాటలో కొంతడబ్బు ఓడిపోయాడు. ముసలమ్మ తన తిండంతా పెట్టింది. రాత్రి పదిగంటలకు యింటికి వచ్చిన మూర్తిని చూసి, ముసలమ్మ మందలించింది, మూర్తి తినేవరకూ తెలివితో వుంది. ఉమ తినేటట్లు చెయ్యలేకపోయింది.

ఆ మరుసటిరోజు యెడముఖాలు పెడముఖాలతో దంపతు లిద్దరిమధ్యా సాగిపోయింది. మధ్యాహ్నం మూర్తి రెండురోజుల కేంపుకని బయలుదేరాడు. వెళ్ళేముందు ముసలమ్మకు చెప్పనూలేదు; సాయంత్రమునించీ ముసలమ్మ లోనికి రానూలేదు;ఎక్కడా అడుక్కోనూలేదు. పెరటి వాకిట్లోనే పడుకుంది. తిన్నావా అని యెవరూ అడగలేదు. నీరసంతో లోనే మూలుక్కుంటోంది. అక్కడే కాస్సేపు నిల్చున్న - యెముకలు మిగిలిన గడ్డి కుక్క కళ్ళల్లో నీటితో గట్టిగా మూలిగింది. ఎక్కడో పారేసిన యెంగిలాకు యెండి గాలికి యెగురుతూ వచ్చింది. పనికిరాని చెత్తకాగితా లన్నీ చెత్త డొక్కుల్లో చిందరవందరగా వున్నాయ్. పెరటిగార్డెన్‌లో యెండిపోతున్న ఆకులు రాల సిద్ధంగా వున్నాయ్.ముసలమ్మకు ఆకలి అధిక మౌతున్నకొద్దీ అలసట హెచ్చుగావుంది. ప్రపంచంలో యెందుకూ పనికిరాని వస్తువు లెన్నో వున్నాయ్. అందులో తనొక్కర్తి ననుకుంది. కేకవేస్తే 'ఓయ్' అన్న దూరంలో చావు యెలాగా తన కోసం కాచుక్కూర్చుంది. ఆ చావు కేక వేసేముందు ఏదైనా మంచి చేస్తే ఆ పనికిరాని వస్తువుల జాబితానించి బయటపడేదాన్ని అనుకుంది. అడుక్కోవటం తప్పించి తన కేం చాతకాదనీ, పండుతాలూకు యెండిన తొక్క దేనికీ పనికిరాదనీ నిస్పృహతో నిద్దరరాక, ఆకలిభూతం భయపెట్తుండగా అర్థరాత్రివరకూ అలానే నేలకు చీకట్లో ఒంటిగా అంటుకునిపోయింది.

చీమ కదలిక వలన వచ్చిన శబ్దాన్ని కూడా ఆ ముదుసలి చెవులు వింటాయ్. ఏదో చిన్న శబ్దం వినిపించినా అది గాలి హోరని ఒకసారి, తోటలో ఆకుల కదలిక అని యింకోసారి అనుకుంది. చీకట్లో కళ్ళు కనపడక పోయినా, మనసు ఆలోచిస్తోంది.




మనసులో వూహించిన ఆకారాలు కళ్ళ యెదుట ప్రత్యక్షమైన ట్లున్నాయ్. మొదట యిదంతా తన వూహాలే అనుకుంది. తరువాత నిదానించి చూసింది. మొదట భూతా లనుకుని లేచి నిల్చుంది. కిటికీగుండా యేదో వెలుతురు వెలిగి ఆరిపోతోంది. బయట ఒక మనిషి నిల్చున్నట్లు పోల్చుకుని అటు వేపు నాలుగడుగులు వేసి "యెవరు ?" అంది.

జవాబు లేదు. కాస్త దగ్గరికి వెళ్ళి దృఢంగా "ఎవరు బాబూ?" అంది జవాబు లేకపోగానే అదే పనిగా "దొంగలర్రో...దొంగలూ..." అని అరవసాగింది. ఇంతలో వాడు ఆమె నోట్లో, ఆమె చీరచెంగు కుక్కుతూ ఆ ప్రవాహాన్ని ఆపడానికి ప్రయత్నిస్తున్నా, విదలించుకుంటూ అరవటానికి ప్రయత్నిస్తోంది. మరో యిద్దరు వాడ్ని చేరారు. ఒకడి చేతిలో ఒక మూట యేదో వుంది. చప్పున ఆ మూట మీదికి ఒక స్ప్రింగ్ ఎగిరినట్లు ఎగిరి లాక్కుని చిందర వందరగా విసిరేసింది. గోళ్ళతో రక్కుతున్న రాబందులా, యెముకలగూడుతో వికటాట్టహాసం చేస్తున్న పిశాచంలా వాళ్ళను విడిచిపెట్టకపోగానే ఒకడు కర్రతో ఆమె నెత్తిన బాదాడు. మునలమ్మ కూలిపోయింది. ఉత్తిచేతులతో దొంగలు పరుగు లంకించారు.

నలుగురూ గుమిగూడేసరికి మునలమ్మ కొనవూపిరితో దొంగలు పోయిన వేపే చెయ్యి చూపిస్తోంది. షాక్ తిన్న యింటి యజమానురాలు కోలుకుని తెలివి తెచ్చుకునేసరికి మునలమ్మ మరణించింది.

——